క్లుప్తంగా

కరాటేతో ఆత్మరక్షణ



స్టేషన్ మహబూబ్‌నగర్: జిల్లా కేంద్రంలోని షాషాబ్‌గుట్ట అల్‌నూర్ హైస్కూల్‌లో ఆదివారం కింగ్ షోటోకాన్ కరాటే డూ ఇండియా ఫౌండర్ జహంగీర్‌పాషా ఖాద్రీ ఆధ్వర్యంలో ఉచిత కరాటే శిక్షణ శిబిరాన్ని ప్రిన్సిపాల్ నజియా సుల్తానా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. సెల్ఫ్ డిఫెన్స్ కోసం బాలికలు, మహిళలు కరాటే వంటి యుద్ధ విద్యలు నేర్చుకోవాలని సూచించారు. వేసవిలో నిర్వహించే ఉచిత కరాటే శిక్షణ శిబిరాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఖాజాపాషా, కింగ్ షోటోకాన్ వైస్‌చైర్మన్ చెన్న వీరయ్య, జహంగీర్‌పాషా ఖాద్రీ, మహేశ్, షరీఫ్, ఖిజ్ర పాల్గొన్నారు.

మాజీ జెడ్పీటీసీ మృతిపై సంతాపం



విద్యావతమ్మ (ఫైల్)

అడ్డాకుల: మూసాపేటకు చెందిన మాజీ జెడ్పీటీసీ సభ్యురాలు అమ్మిక విద్యావతమ్మ (75) ఆదివారం మృతిచెందారు. కాంగ్రెస్ పార్టీకి చెందిన ఆమె ఉమ్మడి అడ్డాకుల మండల జెడ్పీటీసీగా పనిచేశారు. వారంరోజుల క్రితం అనారోగ్యానికి గురైన ఆమెను కుటుంబ సభ్యులు ఆస్పత్రికి తరలించగా.. అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందారు. ఆమెకు ముగ్గురు కుమారులు, కుమార్తె ఉన్నారు. ఆమె భర్త రామచంద్రయ్యగౌడ్ వైద్యుడిగా మండల ప్రజలకు సేవలు అందించి.. కొన్నేళ్ల క్రితం మృతిచెందారు. విద్యావతమ్మ మృతిపై వివిధ పార్టీలకు చెందిన నాయకులు సంతాపం వ్యక్తం చేశారు. దేవరకద్ర మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి విద్యావతమ్మ మృతదేహంపై పూలమాలవేసి నివాళులర్పించారు.

భూమి వివరాలు నమోదు చేసుకోవాలి

మహమ్మదాబాద్: ఇటీవల కేంద్ర ప్రభుత్వం రూపొందించిన ప్రత్యేక యాప్‌లో రైతులు తమ భూమి వివరాలను నమోదు చేసుకోవాలని ఏఓ నరేందర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. భూమి కలిగిన ప్రతి రైతు ఈ నెల 31వ తేదీలోగా భూమి వివరాలను నమోదు చేసుకోవాల్సి ఉంటుందన్నారు. ఇందుకు గాను మండలంలోని రైతువేదికల్లో ఏఈఓలు అందుబాటులో ఉంటారని తెలిపారు.

ఉన్నత శిఖరాలను అధిరోహించాలి



మహబూబ్‌నగర్ రూరల్: ప్రతి విద్యార్థి చదువులో రాణించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని మాజీ ఎంపీటీసీ రవీందర్‌రెడ్డి అన్నారు. పదో తరగతి పరీక్షల్లో ఉత్తీర్ణులైన ధర్మాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులను శనివారం గ్రామ పెద్దలతో కలిసి శాలువాలతో సత్కరించి అభినందించారు. అత్యధిక మార్కులు సాధించిన అక్షయ (566), సి.తేజస్విని (504), బి.సుభాష్(502)లకు నగదు బహుమతులను అందజేశారు. విద్యార్థులను చదువులో ప్రోత్సహించాలనే ఉద్దేశంతో ఆత్మీయ సన్మాన కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు వావిళ్ల మేఘారెడ్డి, బోల యాదయ్య, ఎస్.రాజగోపాల్‌యాదవ్, ఎం.విజయ్‌గౌడ్, బానూరు శ్రీనివాస్‌రెడ్డి, బైని యాదయ్య, చుక్క మల్లేష్, గ్రామ మీడియా కన్వీనర్ ఎంకిగారి అశోక్ పాల్గొన్నారు.

కంపు కొడుతున్న కాలనీలు



జడ్చర్ల: కావేరమ్మపేటలో డ్రెయినేజీ సమస్యతో ప్రజలు సతమతమవుతున్నారు. ప్రధానంగా డబుల్‌బెడ్రూం ఇళ్ల వద్ద డ్రెయినేజీ నిర్మించక పోవడంతో మురుగు రోడ్లపైనే ప్రవహిస్తోంది. డబుల్‌బెడ్రూం ఇళ్లలో దాదాపు 90 కుటుంబాలు నివాసం ఉంటున్నాయి. నిత్యం అక్కడి నుంచి మురుగు దిగువ ప్రాంతంలోని ఆదర్శనగర్, హనుమాన్ వీధి తదితర కాలనీల్లోకి పారుతుండటంతో పారిశుద్ధ్య సమస్య తలెత్తుతోంది. ఫలితంగా ఈగలు, దోమలు విజృంభిస్తున్నాయని కాలనీ వాసులు వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు, పాలకులు స్పందించి డ్రెయినేజీ సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

భక్తుల ఇలవేల్పు లోకిరేవు వీరభద్రుడు



ఉత్సవాలకు ముస్తాబైన లోకిరేవు వీరభద్రస్వామి దేవాలయం



భద్రకాళి సమేత వీరభద్రస్వామి మూలవిరాట్

- రేపటి నుంచి వీరభద్రస్వామి ఉత్సవాలు
- ఏర్పాట్లు పూర్తిచేసిన నిర్వాహకులు

నవాబుపేట: మండలంలోని లోకిరేవులో ఏకశిలతో స్వయంభూగా వెలసి.. ఇక్కడి ప్రజల ఇంటి దేవుడిగా వెలుగొందుతున్న భద్రకాళి సమేత వీరభద్రస్వామి ఉత్సవాలు మంగళవారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఏకశిలతో నిలువెత్తు రూపం లోకిరేవు వీరభద్రుడి ప్రత్యేకత. ఎక్కడ అయినా వీరభద్రుడి విగ్రహం చిన్నగా ఉంటుంది. కానీ లోకిరేవులోని పురాతన దేవాలయంలో మాత్రం ఐదున్నర అడుగుల నిలువెత్తు విగ్రహం ఏకశిలతో ఉండటం.. వీరభద్రుడి తలపై శివలింగం ఉండటం ఇక్కడి విశేషం. కొని దశాబ్దాల క్రితం లోకిరేవు వాగు ఒడ్డుపై వెలసిన స్వామివారు భక్తులతో నిత్య పూజలు అందుకుంటున్నారు. తెలంగాణతో పాటు ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, మహారాష్ట్ర ప్రాంతాల నుంచి భక్తులు తమ ఇలవేల్పుగా భావిస్తారు. ప్రతి ఏడాది మే నెలలో స్వామివారి ఉత్సవాలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. ఉత్సవాల్లో భాగంగా రథోత్సవం, శకటోత్సవం, అగ్నిగుండ మహోత్సవాలు పెద్దఎత్తున నిర్వహిస్తారు. కాగా, అగ్నిగుండ మహోత్సవంలో చాలా మంది శివ భక్తులు అగ్నిలో నడిచి మొక్కులు తీర్చుకుంటారు.

కార్యక్రమాలు ఇలా..

లోకిరేవు వీరభద్రస్వామి ఉత్సవాల్లో భాగంగా ఈ నెల 6న నందికోళ్ల సేవ, 7వ తేదీ తెల్లవారు జామున అగ్నిగుండ మహోత్సవం, సాయంత్రం శకటోత్సవం, పార్వతీ పరమేశ్వరుడి కల్యాణ్యం నిర్వహించనున్నట్లు పూజారులు లింగయ్య, నందీశ్వర్ తెలిపారు. 8న ప్రత్యేక అలంకరణ, 9న మహా మంగళహారతితో ఉత్సవాలు ముగుస్తాయని పేర్కొన్నారు. కాగా, ఉత్సవాల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తిచేసినట్లు నిర్వాహకులు తెలిపారు. ఉత్సవాల్లో భక్తులు పెద్దఎత్తున పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కావాలని కోరారు.

'భూ భారతి' పైలెట్ ప్రాజెక్టుగా మూసాపేట

- నేటి నుంచి గ్రామాల వారీగా రెవెన్యూ సదస్సులు

అడ్డాకుల: రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా రూపొందించిన భూ భారతి చట్టం అమలు కోసం జిల్లాలోని మూసాపేట మండలాన్ని పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేశారు. ఈ మేరకు సోమవారం నుంచి 13వ తేదీ వరకు మండలంలోని 13 గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించనున్నారు. సదస్సుల నిర్వహణ కోసం రెండు బృందాలను ఏర్పాటు చేశారు. రైతులు ఎదుర్కొంటున్న భూ సమస్యలపై రెవెన్యూ అధికారులు దరఖాస్తులు స్వీకరించి.. నెలాఖరులోగా పరిష్కరించనున్నారు. అయితే రెవెన్యూ సదస్సుల నిర్వహణపై ముందుగానే రైతులకు సమాచారం చేరవేస్తున్నారు. అయితే భూములకు సంబంధించిన సమస్యలను అధికారులకు లిఖిత పూర్వకంగా తెలియజేసేందుకు నిర్దేశిత ఫార్మాట్‌కు సంబంధించిన పత్రాలను అందుబాటులో ఉంచుతున్నట్లు తహసీల్దార్ రాజునాయక్ తెలిపారు. దరఖాస్తుల పరిష్కారానికి ఎలాంటి రుసుము చెల్లించాల్సిన అవసరం లేదని చెప్పారు. కాగా, తహసీల్దార్లు రాజు నాయక్, మదన్మోహన్‌గౌడ్ ఆధ్వర్యంలో రెవెన్యూ సదస్సులు నిర్వహించనున్నారు. సాగులో ఉండి పట్టాలు లేకున్నా.. పట్టా ఉండి పొజిషన్ లేని దరఖాస్తులను కూడా పరిశీలించనున్నారు. సాదాబైనామా దరఖాస్తులను కూడా స్వీకరించనున్నట్లు అధికారులు తెలిపారు. ఉదయం 9 నుంచి సాయంత్రం 4గంటల వరకు రెవెన్యూ అధికారులు గ్రామాల్లో ప్రజలకు అందుబాటులో ఉంటారని తహసీల్దార్ రాజు నాయక్ తెలిపారు.

➠ 5న చక్రాపూర్, తుంకినీపూర్, 6న జానంపేట, వేముల, 7న పోల్కంపల్లి సంకలమద్ది, 8న కొమిరెడ్డిపల్లి, నందిపేట, 9న మహమ్మదుహుస్సేన్‌పల్లి, నిజాలాపూర్, 12న తిమ్మాపూర్, దాసర్‌పల్లి, 13న కనకాపూర్ గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించనున్నట్లు తహసీల్దార్ తెలిపారు. అధికారులు అందుబాటులో ఉండే గ్రామాల్లో ప్రజలు తమ భూములకు సంబంధించిన సమస్యలపై దరఖాస్తులు అందించి.. వాటి పరిష్కారానికి సహకరించాలని కోరారు.

శక్తివంతమైన ఆయుధం చదువు

- ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి కృషి
- రాష్ట్ర విద్యాశాఖ కమిషన్ సభ్యుడు వెంకటేశ్



విద్యార్థిని శ్రీవిద్యను అభినందిస్తున్న రాష్ట్ర విద్యాశాఖ కమిషన్ సభ్యుడు వెంకటేశ్

జడ్చర్ల టౌన్: విద్యార్థులకు అత్యంత శక్తివంతమైన ఆయుధం చదువు అని.. ఎట్టి పరిస్థితుల్లోనూ నిర్లక్ష్యం చేయరాదని రాష్ట్ర విద్యాశాఖ కమిషన్ సభ్యుడు చారకొండ వెంకటేశ్ అన్నారు. ఆదివారం రాత్రి జడ్చర్లకు వచ్చిన ఆయన.. పదో తరగతిలో 565 మార్కులు సాధించిన బాదేపల్లి బాలికల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని శ్రీవిద్యను శాలువాతో సత్కరించి నగదు పురస్కారం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిరుపేద కుటుంబాలకు చెందిన ఎంతో మంది విద్యార్థులు పదో తరగతి ఫలితాల్లో మంచి మార్కులు సాధించారన్నారు. ప్రభుత్వం సైతం సర్కారు పాఠశాలలను బలోపేతం చేయడంతో పాటు విద్యార్థులకు మెరుగైన విద్య అందించేందుకు పాటు పడుతుందన్నారు. విద్యారంగంలో అనేక సంస్కరణలు రానున్నాయని.. కార్పొరేట్ స్థాయిలో విద్య అందించేందుకు కృషి చేస్తున్నట్లు చెప్పారు. విద్యార్థిని శ్రీవిద్య ఉన్నత చదువుకు తాను పూర్తిగా సహకరిస్తానని.. అందుకు స్థానిక ఉపాధ్యాయుడు కావలి కృష్ణ బాధ్యత తీసుకోవాలని ఆయన సూచించారు. విద్యార్థులు జ్ఞానసంపద పెంపొందించుకుని బాబా సాహెబ్ అంబేడ్కర్ చూపిన మార్గంలో పయనించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బీటీఎఫ్ రాష్ట్ర నాయకుడు విజయ్, సహాయ కార్యదర్శి రమేష్, జూనియర్ లెక్చరర్ల ఫోరం అసోసియేట్ కార్యదర్శి లక్ష్మణ్, ఎస్ఎస్‌యూఐ రాష్ట్ర కార్యదర్శి శేఖర్ పాల్గొన్నారు. అదే విధంగా అంబేడ్కర్ కళాభవన్‌లో దళితరత్న–2025 అవార్డు గ్రహీతలు రిటైర్డ్ జూనియర్ అసిస్టెంట్ నర్సింహులు, రిటైర్డ్ ఎంపీడీఓ రాములు మాదిగను ఉద్యోగుల సమాఖ్య ఆధ్వర్యంలో ఆయన సన్మానించారు.

కూచిపూడి నృత్య శిక్షణ ప్రారంభం



అప్పంపల్లిలో విద్యార్థులకు కూచిపూడి నృత్యంలో శిక్షణ ఇస్తున్న శిక్షకులు

చిన్నచింతకుంట: కొకుంట్ల మండలం అప్పంపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ, కళా వికసిత కల్చరల్ థియేటర్ సంయుక్త ఆధ్వర్యంలో కూచిపూడి నృత్య శిక్షణ శిబిరాన్ని ప్రారంభించారు. అప్పంపల్లి యువసేన యూత్ అసోసియేషన్ సహకారంతో నిర్వహించే శిబిరంలో విద్యార్థులకు 30 రోజులపాటు ఉచితంగా కూచిపూడి నృత్య శిక్షణ ఇవ్వనున్నట్లు కళా వికసిత కల్చరల్ థియేటర్ అధ్యక్షుడు కలీం ఆజాద్ తెలిపారు. కూచిపూడి నాట్యం పట్టణ ప్రాంతాలకే పరిమితం కాకుండా గ్రామీణ ప్రాంతాల్లో సైతం విద్యార్థులను ప్రోత్సహించేందుకు కృషి చేస్తున్నట్లు చెప్పారు. కళలు సమాజ వికాసం, భావాలకు రూపాన్ని ఇస్తాయని అన్నారు. గ్రామీణ ప్రాంత చిన్నారుల్లో ప్రతిభను వెలికి తీస్తామన్నారు. కార్యక్రమంలో యువసేన యూత్ నాయకులు ఎం.రవి, దత్తమూర్తి, బాలకృష్ణ, నరేష్, రంజిత్, శ్రావణి, హేమలత పాల్గొన్నారు.

నవాబుపేట మార్కెట్‌కు భారీగా వరిధాన్యం

నవాబుపేట: మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్‌యార్డుకు ఆదివారం 10వేల బస్తాల వరిధాన్యం విక్రయానికి వచ్చింది. 1010 రకం వరిధాన్యం 4,613 బస్తాలు రాగా.. రూ. 2,240 ధర పలికింది. ఆర్ఎన్ఆర్ రకం 5,283 బస్తాలు రాగా.. రూ. 2,314 ధర వచ్చినట్లు మార్కెట్ కార్యదర్శి రమేశ్ తెలిపారు. కనిష్ఠంగా రూ. 1,890 ధర పలికినట్లు పేర్కొన్నారు.

కొనసాగిన అన్నదానం



నవాబుపేట: మండల కేంద్రంలో ఆదివారం జరిగిన వారాంతపు సంతలో అన్నదాన కార్యక్రమం కొనసాగింది. వివిధ గ్రామాల నుంచి వారాంతపు సంతకు వచ్చే ప్రజల ఆకలి తీర్చేందుకు గాను మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ నర్సింహాచారి 10నెలల క్రితం అన్నదాన కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. నాటి నుంచి ప్రతి ఆదివారం అన్నదాన కార్యక్రమం కొనసాగుతోంది. తాజాగా నిర్వహించిన కార్యక్రమంలో వ్యాపార సంఘం మండల అధ్యక్షుడు సుధాకరాచారి, పుట్టి ఆంజనేయులు, నిరంజన్, విశ్వనేత్ర, బాబ్లు, నసీర్, వెంకటయ్య, రఘు పాల్గొన్నారు.

బీజేపీ మండల అధ్యక్షుడిగా లక్ష్మీనారాయణ



నవాబుపేట: బీజేపీ మండల అధ్యక్షుడిగా కొండాపూర్‌కు చెందిన లక్ష్మీనారాయణను నియమించినట్లు ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి ఆదివారం ప్రకటించారు. మండల పూర్తిస్థాయి కమిటీని త్వరలో ప్రకటిస్తామని ఆయన తెలిపారు. మండల అధ్యక్షుడిగా ఎన్నికైన లక్ష్మీనారాయణను స్థానిక నాయకులు శ్రీనివాస్, యాదయ్య, మధుసూదన్‌రెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, రాజు, బాలస్వామి, మల్లేష్ రామకృష్ణ తదితరులు అభినందించారు. అదే విధంగా ఎంపీ డీకే అరుణ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు.

వరిగడ్డి దగ్ధం

అడ్డాకుల: మండలంలోని రాచాలలో ఆదివారం వరిగడ్డి దగ్ధమైంది. గ్రామ సమీపంలోని పెద్ద చెరువు కింద వరికొయ్యలకు గుర్తుతెలియని వ్యక్తి నిప్పంటించడంతో పొలాల్లో ఉన్న వరిగడ్డి కట్టలు పూర్తిగా దగ్ధమయ్యాయి. అదే విధంగా కరెంటు తీగలు, పైపులు, ఇతర వ్యవసాయ సామగ్రి మంటల్లో కాలిపోయింది. చెరువు కింద సుమారు 150 ఎకరాల్లో వరిగడ్డి కాలి బూడిద కావడంతో రైతులకు తీవ్రనష్టం వాటిల్లింది.

'పాలమూరు–రంగారెడ్డి'ని పూర్తి చేయాలి



మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు బాలనరసింహ

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: పాలమూరు–రంగారెడ్డి ఎత్తిపోతల పథకాన్ని వెంటనే పూర్తి చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు ఎం.బాలనరసింహ అన్నారు. ఆదివారం జిల్లా పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నదీ జలాల వినియోగంలో ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా తీవ్ర అన్యాయానికి గురైందని.. అభివృద్ధిని పాలకులు మాటలకే పరిమితం చేయకుండా చేతల్లో చూపించాలన్నారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను తప్పక అమలు చేయాలన్నారు. పార్టీతో పాటు ప్రజా సంఘాలను గ్రామస్థాయి నుంచి బలోపేతానికి నాయకులు, కార్యకర్తలు పాటుపడాలన్నారు. అంతకుముందు పహల్గాం ఘటనలో మృతిచెందిన వారికి శ్రద్ధాంజలి ఘటించారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు బృగి బాల్‌కిషన్, గోవర్ధన్, అల్వాల్‌రెడ్డి, డి.రాము, పి.సురేష్, బి.ఆర్.విల్సన్, కోటకదిర నరసింహ, చాంద్‌బాషా, సత్యనారాయణరెడ్డి, సి.రాజు, కె.పద్మావతి పాల్గొన్నారు.

చదువుతోపాటు క్రీడలు అవసరం



విజేత జట్లకు ట్రోఫీలు అందజేస్తున్న మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్

మహబూబ్‌నగర్ క్రీడలు: విద్యార్థులు చదువుతో పాటు క్రీడలకు ప్రాధాన్యం ఇవ్వాలని మాజీ మంత్రి వి.శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ఖలీల్‌చౌక్ ప్రీమియర్ లీగ్ అండర్–20 క్రికెట్ టోర్నమెంట్ విజేతలకు ఆదివారం ట్రోఫీలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. యువత జీవితంలో ఉన్నతంగా రాణించి తల్లిదండ్రులను బాగా చూసుకోవాలని సూచించారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో మహబూబ్‌నగర్‌ను పూర్తిస్థాయిలో అభివృద్ధి చేసినట్లు వివరించారు. క్రీడల్లో యువతను ప్రోత్సహించేందుకు గాను క్రీడా కిట్లు అందజేసినట్లు గుర్తుచేశారు. ఇండోర్ స్టేడియాల నిర్మాణంతో పాటు ఓపెన్ జిమ్‌లు ఏర్పాటు చేశామన్నారు. యువత స్థానికంగా ఉపాధి పొందేందుకు పరిశ్రమలను తీసుకువచ్చామని అన్నారు. కార్యక్రమంలో నాయకులు ముడా మాజీ చైర్మన్ గంజి వెంకన్న, పార్టీ నాయకులు మోసీన్‌ఖాన్, ఇమ్రాన్, నవకాంత్, రవీందర్‌రెడ్డి, దేవేందర్‌రెడ్డి, రామకృష్ణ, నిర్వాహకులు జుబేర్, మజహర్, షాకీర్, షాబాజ్ పాల్గొన్నారు.

ఘనంగా భగీరథ మహర్షి జయంతి



భగీరథ మహర్షి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

స్టేషన్ మహబూబ్‌నగర్: జిల్లా కేంద్రంలోని బీసీ సమాజ్ ఉమ్మడి జిల్లా కార్యాలయంలో ఆదివారం భగీరథ మహర్షి జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు ఎం.శ్రీనివాస్‌సాగర్ మాట్లాడారు. మహా జ్ఞాని భగీరథ మహర్షి అని.. ఆయన పరోపకారానికి పెట్టింది పేరు అని అన్నారు. ఎంత కష్టాన్ని అయినా లెక్కచేయకుండా అనుకున్నది సాధించేంత వరకు అలుపెరగని పోరాటం చేసి.. దివి నుంచి గంగను భువికి తీసుకుచ్చారని అన్నారు. కార్యక్రమంలో పద్మశాలి సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు సారంగి లక్ష్మీకాంత్, ఆయా సంఘాల నాయకులు బుగ్గన్న, ఆశన్న ముదిరాజ్, అశ్విని సత్యం, సత్యనారాయణ, బి.శేఖర్, ఆంజనేయులు పాల్గొన్నారు.

రైలు కిందపడి వృద్ధురాలి దుర్మరణం

దేవరకద్ర రూరల్: రైలు కిందపడి వృద్ధురాలు మృతిచెందిన ఘటన మండలంలోని వెంకటాయపల్లిలో ఆదివారం చోటు చేసుకుంది. స్థానికుల వివరాల మేరకు.. వెంకటాయపల్లికి చెందిన సాకలి కిష్టమ్మ (58) గ్రామ సమీపంలోని రైలు పట్టాలు దాటుతుండగా.. గుర్తుతెలియని రైలు ఢీకొట్టింది. ప్రమాదంలో ఆమెకు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతిచెందింది. ఈ ఘటనకు సంబంధించి పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

పరామర్శ

నవాబుపేట: మండలంలోని కాకర్లపహడ్‌కు చెందిన బీఆర్ఎస్ నాయకుడు సంజీవరెడ్డి తల్లి అనసూయమ్మ (69), కాకర్జాలతండా మాజీ ఉపసర్పంచ్ హరినాయక్ తండ్రి సక్రూ నాయక్ (70) అనారోగ్యంతో మృతిచెందారు. విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి లక్ష్మారెడ్డి ఆదివారం బాధిత కుటుంబాలను పరామర్శించారు. ఆయన వెంట పీఏసీఎస్ చైర్మన్ నర్సింహులు, మాజీ జెడ్పీటీసీ రవీందర్‌రెడ్డి, మాజీ ఎంపీపీ శ్రీనివాస్, మాజీ వైస్‌ఎంపీపీ సంతోష్‌రెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ లక్ష్మయ్య, ప్రతాప్, కృష్ణయ్య, మాధవ్ ఉన్నారు.

ఘనంగా ఎంపీ డీకే అరుణ జన్మదిన వేడుకలు



కేక్ కట్ చేస్తున్న ఎంపీ డీకే అరుణ

పాలమూరు/మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ జన్మదిన వేడుకలను ఆదివారం బీజేపీ నాయకులు, కార్యకర్తలు ఘనంగా నిర్వహించారు. మొదట రెడ్‌క్రాస్ సొసైటీ అనాథ శరణాలయంలో విద్యార్థులకు స్కూల్ బ్యాగ్‌లు పంపిణీ చేశారు. అనంతరం విద్యార్థుల నడుమ ఎంపీ డీకే అరుణ కేక్ కట్ చేశారు. అదే విధంగా జిల్లా పార్టీ కార్యాలయంలో 65 కేజీల కేక్ కట్ చేయగా.. ముఖ్య నేతలు, కార్యకర్తలు ఎంపీకి పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా పార్టీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన రక్తదాన శిబిరాన్ని ఎంపీ ప్రారంభించారు.

➠ పాలమూరు యూనివర్సిటీకి ఎంపీ డీకే అరుణ అంబులెన్స్ వితరణ చేశారు. పీయూ విద్యార్థులకు ఆరోగ్య సమస్యలు తలెత్తితే జిల్లా ఆస్పత్రికి తరలించేందుకు గాను అంబులెన్స్ అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో పీయూ వీసీ శ్రీనివాస్, రిజిస్ట్రార్ రమేష్‌బాబు, మనోహర్, సూర్య, నర్సింహ తదితరులు పాల్గొన్నారు.

నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యం



దేవరకద్రలో ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డిని భుజాలపై ఎత్తుకున్న కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, అభిమానులు

దేవరకద్ర/చిన్నచింతకుంట: నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తున్నట్లు ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి అన్నారు. ఆదివారం దేవరకద్ర బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానుల నడుమ ఎమ్మెల్యే జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. వేలాదిగా తరలివచ్చిన కార్యకర్తలు ఎమ్మెల్యే భుజాలపై ఎత్తుకుని వేదికపైకి తీసుకువచ్చారు. అనంతరం మధుసూదన్‌రెడ్డి – కవిత దంపతులను గజమాలతో సత్కరించగా.. ఆయన భారీ కేక్‌ను కట్ చేశారు. ఈ సందర్భంగా జరిగిన భారీ బహిరంగ సభలో ఎమ్మెల్యే ఉద్వేగంగా ప్రసంగించారు. గత పాలకుల నిర్లక్ష్యం కారణంగా అభివృద్ధిలో వెనుకబడిన ఈ ప్రాంతాన్ని అన్ని రంగాల్లో ప్రగతి సాధించడం కోసం అహర్నిశలు కృషి చేస్తున్నట్లు చెప్పారు. ప్రజా సేవకే తన జీవితం అంకితమన్నారు. ప్రభుత్వ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరికీ అందిస్తామన్నారు. నియోజకవర్గంలో సాగు, తాగునీటికి కొదవ లేకుండా చూస్తామన్నారు. అనంతరం మెగా వైద్య శిబిరాన్ని ఎమ్మెల్యే ప్రారంభించగా.. అపోలో, యశోద, అమోర్, మహబూబ్‌నగర్ ఎస్వీఎస్ ఆస్పత్రుల వైద్యులు 1,174 మందికి పరీక్షలు చేసి ఉచితంగా మందులను అందజేశారు. అదే విధంగా 398 మంది కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. అదే విధంగా దేవరకద్రలో బ్రహ్మకుమారీస్ నూతన భవన నిర్మాణానికి ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి దంపతులు భూమిపూజ చేశారు.

➠ కురుమూర్తి స్వామిని ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి దంపతులు దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ముందుగా ఎమ్మెల్యే దంపతులకు ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికి శాలువాతో సత్కరించారు. అనంతరం ఆలయ రాజగోపురం వద్ద పార్టీ నాయకులు, కార్యకర్తల మధ్య ఎమ్మెల్యే కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ గోవర్ధన్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.



ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న దోకూర్ పాఠశాల పూర్వ విద్యార్థులు



పీయూ ఫార్మసీ కళాశాల 2011-15 బ్యాచ్ విద్యార్థులు

అ'పూర్వ' సమ్మేళనం

స్టేషన్ మహబూబ్‌నగర్/మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: దేవరకద్ర మండలం దోకూర్ ప్రాథమికోన్నత పాఠశాలలో 1నుంచి 7వ తరగతి చదివిన 1982–89 బ్యాచ్ విద్యార్థులు ఆదివారం జిల్లా కేంద్రంలోని కొత్తగంజ్ శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయ కల్యాణ మండపంలో ఆత్మీయ సమ్మేళన కార్యక్రమం నిర్వహించారు. దోకూర్, జీన్గురాల గ్రామాలకు చెందిన పూర్వ విద్యార్థులు 35 ఏళ్ల తర్వాత కలుసుకొని ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకున్నారు. తమ చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. అప్పటి ఉపాధ్యాయులు చెన్నకిష్టయ్య, మార్కెండేయను శాలువా, పూలమాలలతో ఘనంగా సన్మానించారు.

➠ పాలమూరు యూనివర్సిటీ ఫార్మసీ కళాశాలకు చెందిన 2011–15 బ్యాచ్ విద్యార్థులు మయూరీ పార్కులో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా అందరి యోగక్షేమాలను తెలుసుకున్నారు. కార్యక్రమంలో రాజునాయక్, సుందర్, శివ, జీవన్, జ్యోతి, దీపిక, సుగుణ, శ్రీజ పాల్గొన్నారు.

మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నెంబర్లకు ఉదయం 7-00 గం॥ల నుండి రాత్రి 8-00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే చర్యలు తీసుకోబడును.

ఎస్.రాజేందర్ గౌడ్, ACM - 9618066349 టోల్‌ఫ్రీ నెం.: 1800 270 1083
మహబూబ్‌నగర్ మహ్మద్ తౌసిఫ్ అలీ - 73969 95582
కోస్గి కె. రమేష్ - 99486 98552
జడ్చర్ల సి. అంజనేయులు - 80966 88450

సాక్షి పాఠక మహాశయులకు విజ్ఞప్తి

మీరు సాక్షిలో వివాహ, జన్మదిన, పదవీ విరమణ, విదేశీ పర్యటన, స్వదేశాగమనం, అవార్డు గ్రహీతలకు శుభాకాంక్షలు, మీ ఆత్మీయులకు శ్రద్ధాంజలి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, బహిరంగ ప్రకటనలు, అతి తక్కువ ఖర్చుతో కొండత స్పందన లభించే క్లాసిఫైడ్ యాడ్స్ ఇవ్వదలచినచో మీరు సంప్రదించవలసిన ఫోన్ నెంబర్లు :
శ్రీశైలం - 97051 35557
వెంకటయ్య - 90108 69797